


మళ్లీ పేకలు కలిపి పంచబోతున్నారు. ఈ సారి ఆసులూ, రాజులూ, రాణీలూ ఎవరికి పడతాయో! అంతా దైవేచ్ఛ!

అన్ని పార్టీలవాళ్లూ రెండేసి బేస్తులు పెట్టి మూటం బేస్తుకు సిద్ధమవుతున్నారు. ఇది కుదేలు ఆట.

ప్రపంచంలో కెల్లా పెద్దదిగా చెప్పబడే ఈ మనదేశం ఒక ద్యూతగృహం. ఇక్కడ నాలుగేళ్లకోసారి ద్యూతమహోత్సవం జరుగుతుంది. ప్రవేశరుసుము చాలా హెచ్చు. ఈ ఆటలో నీకూ, నాకూ స్థానంలేదు. ఇది రాజులూ, మహారాజులూ ఆడే ఆట.

"ఎవరికి వారే యమునా తీరే". "unto each his own" లాంటి సామెతలు ఇక్కడ చెల్లవు. ఇది లాలూచీ ఆట—బహిరంగమైన లాలూచీ, జూదగాళ్ల మధ్య లాలూచీలు అంత సులువుగా జరగవు. ఈ విషయంలో దొంగల నీతి చాలా గొప్పది. జూదగాళ్ళ మధ్య వాటాలు, దొంగలూ దొంగలూ చేరి ఊళ్లు పంచుకున్నంత సవ్యంగా జరగవు.

లాలూచీలు బహిరంగంగా సాగటం ఎట్లా సాధ్యమవుతుందంటే-ఒకటి, ప్రజలకు ఈ జూదం కిటుకు తెలియకపోవటం; రెండు, జూదగాళ్లు పార్టీ ముసుగులు ధరించటం. మనది ముసుగులునమ్మే జాతి. బురఖాలేసుకున్నమనిషల్లా మనకు బూబే; కాషాయ బట్టలు ధరించినవాడల్లా సన్యాసే, హిప్పీ వేషం వేసినవాడల్లా బాబాయే!

అందుచేత మనం ఈ పార్టీలను నమ్ముతాం. కాని ముక్కలు పంచుకునేవాళ్లంతా నిజానికి ఒక పార్టీవాళ్లు కారు. అందులో చాలామంది స్వతంత్రులు (స్వతంత్ర పార్టీవాళ్లు కారు)! వారికి పార్టీలు మార్చే స్వాతంత్ర్యం ఉన్నది.

ఈ జూదం, లాలూచీల్లో ఉన్న ఒక గొప్ప విశేషం ఏమిటంటే, జూదం ముగిసినాక కూడా లాలూచీలు సాగుతూనే ఉంటాయి-మళ్లీ ద్యూతమహోత్సవం ఏర్పాటు అయినాక కూడా. అందుచేత ఈ మహోత్సవం కేవలం మూణ్ణాళ్ళముచ్చటకాదు; ఇది శాశ్వత మహోత్సవం-పత్రికలకు అంతులేని మేత, ప్రజలకు ఎడతెగని డెమోక్రసీ.

పార్టీలపేరు చెప్పుకునే స్వతంత్రులు కాని

వారు ప్రతిపార్టీలోనూ ఇద్దరుముగ్గు రుంటారు. వీరు అగ్రనాయకులు. వాళ్లు చీటికీమాటికీ పార్టీలు మార్చలేరు. ఇందిరాగాంధీ, నిజలింగప్ప, డాంగే - ఇటువంటివాళ్లు, "మేం ఇవాళనుంచీ ఇంకో పార్టీ," అనటానికిలేదు. రాచపీనుగుల సామెతగా, ఈ పెద్ద జూదగాళ్లు పార్టీ మార్చాలంటే, వాళ్ల వెంట పెద్ద తూగిడీ వచ్చెయ్యాలి. కమ్యూనిస్టు, కాంగ్రెసు పార్టీలలాటివి చీలినప్పుడు ఇదే జరిగింది.

పార్టీల మహానాయకులు రంగు ఫిరాయించటానికి లేనంత మాత్రాన జూదంలో ఉండే రజ్జు చెడిపోతోం దనుకోనవసరం లేదు. ఎందుచేత నంటే, ఏపార్టీకీ ఒక రంగు అంటూ లేదు; అథవా ఉన్నా, ఇతర రంగులతో చేరికవల్ల వైవర్ణ్యం ఏర్పడేపోయింది.


ఎక్కడన్నా ఒకరు, "మేం మా రంగుతోనే నిలబడతాం'',అంటే మనం సీరియస్‌గా తీసుకోనవసరం లేదు. ఒకవేళ వాళ్ళే సీరియస్‌గా తీసుకుంటే వాళ్లు నమ్మకంగా కుదేలు పెట్టేస్తారు. ఈ ఆట అలాటిది. ఇందులో మంచివాడికి చోటులేదు.

నేనిదంతా రాజకీయ విముఖత్వంతో చెబుతున్నానని ఎవరన్నా ఆక్షేపించవచ్చు. అలాటిదేమీ లేదు. నా రాజకీయ అవగాహనలో, ఎన్నికలకు నిలబడే కొద్దివేలమంది అభ్యర్థులకన్న వాళ్లకు వోట్లు వేసే అనేక కోట్ల మంది ప్రజలు ముఖ్యం.ఇంత కాలంగా జరుగుతున్న ఎన్నికల సంరంభంలో ప్రజల ప్రసక్తి ఏమైనా ఉన్నదా? "ఎవరెన్ని నియోజకవర్గాలకు పోటీ చేయాలి? ఎక్కడ ఏ ఏ పార్టీలు ఏకమై, ఏఏ పార్టీలను చదును చెయ్యాలి? లోకసభ సీట్ల కోసం శాసనసభ సీట్లు త్యాగం చెయ్యాలా, లేక అటునుంచి ఇటా?" ఇవేగదా చర్చలు? క్షమించండి! ఇది జూదగాళ్ల పరిభాష. ఇందులో ప్రజల ప్రమేయం ఏమీ లేదు.

కాని ఈ జూదగాళ్ళు రేపు ప్రజలను వెతుక్కుంటూ వస్తారు! దేనికి? ఈ జూదంలో పణం ప్రజలూ, వాళ్ల ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక జీవితమూనూ. గడిచిన కాలంలో ఇవన్నీ స్వదేశీ, విదేశీ గుత్తదార్లకు చాలా భాగం ధారాదత్తం అయాయి. ఈ పుణ్యభూమిలో హిందువుడై పుట్టిన ప్రతివాడూ కులం అనే బరువును మోస్తూ పుట్టినట్టుగానూ, బానిస కడుపున పుట్టినవాడు బానిస బరువుతో పుట్టినట్టూ, ప్రతి ఆడపిల్లా మన సమాజంలో కట్నం అనే పాపంతో పుట్టినట్టుగా, ఇవాళ ప్రతి భారతీయుడూ రెండువేల తలసరి ఆదాయానికి కాబోలు సమానమైన విదేశీ ఋణ భారంతో పుడుతున్నాడు. స్వాతంత్ర్యం రాక మునుపు అందరికీ అంతో ఇంతో విదేశీ బాంక్ బాలెన్స్ ఉండేది. అది హారతి కర్పూరంలా హరించి పోగా భారతీయ ప్రజా జీవితం ఋణగ్రస్తమైపోయింది. స్వాతంత్ర్యం అందరికీ ఖర్చుపద్దే కాలేదు. కొందరు "అదృష్టవంతులు" ఆకాశంలోకి లేచారు. వాళ్ల తరపునే ఈ ద్యూతమహోత్సవాలు జరుగుతున్నాయి. ప్రజా జీవితం ధర్మరాజు సరిపడేలాగా ఒక్కొక్క పందానికీ తరిగిపోతున్నది.

*  *  *

అయినా, ఎవరికీ పట్టని ప్రజాజీవితం గొడవ మనకు దేనికి? వాళ్లు వోట్లు డబ్బుకు అమ్ముకుంటారని వాపోయేవాళ్లున్నారు. వోటు ఎవరికి వెయ్యాలో తెలీనివాడు నాలుగు డబ్బులన్నా చేసుకుని, రెండు రోజులపాటు కడుపునిండా తిండి తింటే అదైనా దక్కుడు




గద ! వాళ్ళకు "ఓటర్లు" అని పత్రికలు ఊరికే పేరు పెట్టాయా ? వాళ్ళకు వోటర్లు అయే పరిజ్ఞానం వచ్చేసరికి దేశపరిస్థితే మారి పోతుందని ఆశించటం తప్ప మనం చెయ్య గలది ఏమీ కనబడదు.

అందుచేత, నూటికి తొంభై తొమ్మిది మందిని వొదిలేసి, నూటికి ఒకడుగా ఉండే మేధావులు ఈ మహా ద్యూతంలో ఏం చెయ్యాలన్నది ఆలోచిస్తే ఏమీ కనబడకుండా ఉన్నది.

నువు విద్యావంతుడివి, రాజకీయ రంకెలు అర్థం చేసుకోగలవాడివి. కుడి ఎడమలు తెలిసిన వాడివి. నీకు నీ దేశం గురించి ఆట్టేదుగ్దలేకపోయినా, ఏఅమెరికా అంటేనో, ఏరష్యా అంటేనో,ఏచీనా అంటేనో మనసు పీకుతూ ఉండవచ్చు. చీనా రంగు పేక ముక్కల్లో ప్రస్తుతం లేదు గనక దాన్ని వదిలేద్దాం.

పెద్ద ఆటగాళ్లలో రష్యా అభిమాను లున్నారు, అమెరికా అభిమానులున్నారు.అమెరికా వియత్నాం, కాంబోడియాలలో చేసేదే ఇక్కడా చెయ్యటం లేదని దిగులు పడేవాళ్లున్నారు. ప్రీవీ పర్సులు చాలా తాత్కాలికంగా రద్దయితే అన్నమూ, నిద్రా మానేసి కడవలకొద్దీ కన్నీరు కార్చి, పత్రికలను నానబెట్టిన విలేఖరులూ, లేఖకులూ ఉన్నారు. దేశంలో ముస్లిములు లేకుండా పోతేనే గాని మన స్వాతంత్ర్యం పరిపూర్ణం కాదనేవారు ఉన్నారు.

వీళ్లలో నీకు ఏ పెద్దెత్తు జూదగాళ్ల మీద నన్నా మమత ఉండవచ్చు. కాని నీ మమత ఎలా తీరుతుంది. లాలూచీ ఫలితంగా అంతాకలగాపులగమయింది. ఒకే కూటంలో సోషలిస్టు సిద్ధాంతానికి చేతులూ కాళ్ళూ కట్టేసుకున్నవాళ్ళూ, మత పిచ్చగాళ్ళూ,డబ్బు పిచ్చగాళ్ళూ ఉన్నారు. నువు వోటు వేసే చోట నీకు కావలిసిన పిచ్చివాడు అభ్యర్థి కాకపోవచ్చు.దొంగలు ఊళ్ళు పంచుకుంటే, "నేను ఫలాని దొంగకు వచ్చే ఊళ్ళోనే ఉంటాను,"అని పట్టు బట్టటం ఎంత సబబో, "నేను ఫలానా దినుసు పిచ్చిగలవాడికే నా వోటు ఇస్తా" ననటం అంతే సబబు. అది సాగేదికాదు.

అంతే కాదు, జూదంలో గెలుపు డబ్బు

గలవాడిదే. (చూడుము గుర్రపు పందెములు.) ఒక కులం వాళ్ళు ఒక నియోజక వర్గంలో ఉంటే ఆకులం వాణ్ణేనీకు ఎదురుగా పెడతారు. అది గెలుపు పద్ధతి. నీ కిష్టమైన పార్టీ చేరిఉన్న మతా ఎవణ్ణి పెడితే వాడికే నీ వోటు వెయ్యాలి. అక్కడ నీ సిద్ధాంతాలూ, విశ్వాసాలూ చిన్నమెత్తు పనికిరావు. నువు శుద్ధ ఖద్దరు కావచ్చుగాక, లేదా నూరు పైసల డీయమ్కే కావచ్చు గాక; నీ నెత్తిన ఒక కమ్యూనిస్టు అభ్యర్థిని నీవాళ్ళే తెచ్చి పెడితే ఏం చేస్తావు? ఒక ముస్లింలీగు సోదరుణ్ణి తెచ్చి పెడితే ఏం చేస్తావు?

అదే ఇంకో విధంగా అడగాలంటే, ఈ మహోద్యోతంలోనీ ఆదర్శాల కున్న స్థానం ఏమిటి? విలువ ఏమిటి?

అభ్యర్థులు ఏదో చెబుతారు. అది నీబోటి వాళ్ల కోసం. పామరులను డబ్బుతో కొనెయ్యవచ్చు. నువు మేధావివి, నువు డబ్బుకు అమ్ముడు పోయేటంత చవుకపారు భౌతిక వాదివి కావు. అందుచేత నీ వోటును తమ జూదంలో ఎందుకు పణంగా పెట్టవలసి ఉంటుందో నీ అభ్యర్థి చెబుతాడు. కాని ఆ చెప్పేదానికి ఎంత విలువ ఉంటుంది? అన్న మాట నిలబెట్టుకునే శక్తి అతనికి ఏపాటి ఉన్నది? ఆశక్తిని అతను ఉపయోగించుకునేటందుకు ఎంత వరకు కృషి చేస్తాడు-చెయ్యగలడు?

ఈ ప్రశ్నలకు బేతాళుడే సమాధానం చెప్పలేడు.

పరిస్థితి ఇలా ఉందనీ, ఇలా ఉండటం బాగు లేదనీ గ్రహిం...వారు కొందరు ఉన్నారు.

"చదువుకున్నవాళ్లకే వోటు చేసే హక్కంటే ఇంత గందరగోళం లేకపోను." అంటా డొక ఆలోచనాపరుడు.

"ఆస్తి ఉన్నవాళ్లకే వోటుంటే సరిపోయేది," అంటాడు మరొకడు.

చదువుకున్న వాళ్ళకూడా వోటిచ్చినా కూడా అక్షరాస్యత నత్తనడక నడుస్తున్నది; చదువుకున్నవాళ్లకే వోటంటే ఈ దేశంలో నిరక్షరతపోయే దెప్పుడు.

దరిద్రులకు వోటున్నాకూడా ధనికవర్గమే మరింత ధనికమవుతున్నది ; దరిద్రులు అడుగంటే పోతున్నారు. దరిద్రులకు వోటు లేకుండా చేస్తే దేశ దౌర్భాగ్యం తీరేమార్గం ఏమిటి?

లేక-పాపము శమించుగాక! -అసలు వోట్లూ, వోటింగూ లేకుండా చేస్తేనే గాని ఏ సమస్యా పరిష్కారం కాదా?

* * *

తోకముక్క--

"ఎవరికి వోటు వేద్దామనుకుంటున్నావు?"

"అసలు నాకు వోటు వేద్దామని లేదు."

"కొంపదీసి, నువు నక్సలైట్స్‌తో చేరావా ఏం?

"చంపేశావు! పోనీ నువు చెప్పు-నువ్వెవరికి వెయ్యమంటే వారికి వేస్తాను."★



"నాకీ మధ్య నిద్రపట్టటమే లేదు భాయీ! ప్రతిరాత్రీ లాటరీలో లక్షన్నర వచ్చినట్లు కలలొస్తున్నాయి"

"అదృష్ట వంతుడివిరా! నాకు పగలుకూడా అలాంటి కలలే వస్తున్నాయి"